
సైదాబాద్‌లో నిమజ్జనాలకు తరలి వెళుతున్న గణనాథులను వీక్షిస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్


గణనాథులను స్వాగతిస్తున్న సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి


మినీ ట్యాంక్ లో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో కలిసి నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ ప్రవీణ్‌కుమార్


కొత్తపేట చౌరస్తాలో ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై మాట్లాడుతున్న దేప భాస్కర్‌రెడ్డి. వేదికపై ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా


భక్తులకు అన్నదానం చేస్తున్న గడ్డిఅన్నారం భరద్వాజ అపార్ట్‌మెంట్ వాసులు


క్రేన్‌ద్వారా గణపయ్యను చెరువులోకి వదులుతున్న దృశ్యం

జనంలోంచి జలంలోకి..

జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై.. గణపతిబప్పా మోరియా.. అంటూ ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజక వర్గాల్లో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. 11 రోజుల పాటు ప్రత్యేక పూజలందుకున్న బొజ్జ గణపయ్యను భారీ ఊరేగింపులతో నిమజ్జనానికి తరలించారు. మార్గమధ్యలో స్వాగత వేదికలు ఏర్పాటు చేసి భక్తులకు ప్రసాదాలు, తాగునీరు పంపిణీ చేశారు. ఆయా మార్గాల్లో ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసులు తగు ఏర్పాటు చేశారు. –ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం


పసుమాముల గాయత్రిహిల్స్‌లోని లడ్డూను 1.72 లక్షలకు సొంతం చేసుకున్న పట్టాభిరామన్న


పెద్ద చెరువు ప్రాంగణంలోని నిమజ్జన కొలను వద్ద అన్నప్రసాద వితరణ చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు


సరూర్‌నగర్ మినీట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జనం



తాగునీటి కౌంటర్‌ను పరిశీలిస్తున్న జీఎం శ్రీనివాస్ రెడ్డి


గణపతులకు స్వాగతం పలుకుతున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి


హయత్‌నగర్‌లోని వీరభద్రనగర్‌లో..


నిమజ్జన ఊరేగింపులో ఈస్ట్‌ప్రశాంత్‌నగర్ కాలనీవాసులు


ప్రసాదాలు పంపిణీ చేస్తున్న సామ సుందర్‌రెడ్డి


విజయపురి కాలనీ ఫేజ్–2లో త్రినేత్ర ఫ్రెండ్స్ అసోసియేషన్ లడ్డూను రూ. 6.5 లక్షలకు దక్కించుకున్న రాజు


వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లో..


నృత్యాలతో గణపతిని నిమజ్జనానికి తీసుకొస్తున్న దృశ్యం


మన్సూరాబాద్ విజయశ్రీ కాలనీలో..

ఈ లడ్డూ వేలం.. ప్రత్యేకం..

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్ హనుమాన్ దేవాలయంలో గత 60 ఏళ్లుగా నిర్వహిస్తున్న వినాయ ఉత్సవాల్లో లడ్డూకు ఓ ప్రత్యేకత ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు హనుమంతుడి గర్భగుడిలో, రాత్రి గణపతి విగ్రహం చేతిలో పెట్టడం ఆనవాయితీగా వస్తుంది. ఈ లడ్డూ వేలం వేయకుండానే కమిటీ నిర్ణయించిన విధంగా భక్తులు కైవసం చేసుకోవడం మరో విశేషం. ఈ సారి కె.ధీరజ్‌యాదవ్ రూ. 25వేలు, కల్యాణ్ చక్రవర్తి రూ.16 వేలు, విక్కీవైష్ణో రూ. 6 వేలకు సొంతం చేసుకున్నారు.




శివ గంగ కాలనీలో..


చింతలకుంట శక్తినగర్ స్మార్ట్ సిటీలో..


రూ.6.81 లక్షలకు లడ్డూ సొంతం చేసుకున్న రావి రవిప్రతాప్‌రెడ్డి


తిరుమలహిల్స్ గణేష్ లడ్డూ కైవసం చేసుకున్న రాధ లక్ష్మణ్‌ప్రసాద్


నిజాంను తరిమికొట్టిన ఘనత కమ్యూనిస్టులదే..


హయత్‌నగర్‌లో జాతీయ జెండాను ఎగురవేసిన సీపీఐ నేతలు

నాగోలు: నిజాంను తరిమికొట్టిన ఘనత కమ్యూనిస్టులదేనని సీపీఐ మేడ్చల్ జిల్లా నాయకులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. నాగోలు డివిజన్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉడతల మల్లేష అధ్యక్షతన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం అమరవీరులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా అరుణ పతాకాన్ని కృష్ణ ఎగిరేయగా, జాతీయ పతాకాన్ని బి.చుక్కయ్య ఎగరేశారు. వారు మాట్లాడుతూ.. భూమి, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జమీందారులు, రజాకార్ అరాచకాల నుంచి విముక్తి చేయడం కోసం జరిగిన పోరాటంలో 4500 మంది అమరవీరుల బలిదానం జరిగిందని గుర్తు చేసుకున్నారు. సాయిధ పోరాటంలో అసువులు బాసిన వారి జీవితాలు త్యాగం చేసిన వాళ్లకి వారి కుటుంబాలకి నేటికీ సరైన గుర్తింపు లేదని పాలకులు నేటికైనా కళ్లు తెరిచి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాజేందర్, సైదారావు, మధు రాములు, సురేష్, మురళి రాజు, శ్రీనివాస్, జంగయ్య, నిరంజన్, యాదయ్య, రాజ మల్లయ్య, యాదగిరి పాల్గొన్నారు.

మన్సూరాబాద్: తెలంగాణ సాయుధ పోరాట విలీన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి డిమాండ్ చేశారు. సీపీఐ హయత్‌నగర్ మండల కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయ ఆవరణలో మంగళవారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం మాట్లాడారు. సీపీఐ చేపట్టిన తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమంతో గ్రామాల్లో గ్రామ రక్షక కమిటీలు ఏర్పాటై అరాచకాలు చేస్తున్న భూస్వాములపై సామాన్య ప్రజలు తిరుగుబాటు చేశారని గుర్తుచేశారు. ఈ మధ్య మతోన్మాదులు తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందూ, ముస్లిం గొడవలుగా చిత్రీకరిస్తూ సభలు, సమావేశాలు ఏర్పాటు చేయటం సిగ్గు చేటన్నారు. కమ్యూనిస్టులకు వారసులుగా రావి నారాయణరెడ్డి, అరుట్ల కమలాదేవి, బందగీ, షోయబ్ ఉల్లాఖాన్ ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతో మంది నాయకులు ఉన్నారని, మరి మతోన్మాదులకు సంబంధించి ఎవరున్నారో చెప్పగలరా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వంశి వర్ధన్‌రెడ్డి, శ్రీదేవి, సుజాత, నాగరాజు, శోభన్, పారిజాత, జ్యోతి, నవ్య, సుశీల, సౌజన్య, రేణుక, మమత, వెంకట్, బాలరాజు పాల్గొన్నారు.

ప్రజా పాలన దినోత్సవం



లింగోజిగూడ: ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల కార్యాలయంలో మంగళవారం హయత్‌నగర్ సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్య జాతీయ జెండాను ఆవిష్కరించి, అమరులకు నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ సేవా ఇస్లావత్, సరూర్‌నగర్ సర్కిల్ డీసీ సుజాత, ఈఈ శ్రీనివాస్, డీఈ చందన పాల్గొన్నారు.

హాష్ ఆయిల్ విక్రేత రిమాండ్

నాగోలు: హాష్ ఆయిల్‌ను విక్రస్తున్న ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం, కోరాపుట్‌కు చెందిన ఘాసిరామ్ కాశీరం పాంగి(26), స్థానికంగా పండ్ల మార్కెట్‌లో పనిచేస్తున్నాడు. తన బంధువు జగన్నాథ్ కముదితో కలిసి సుల్తాన్ బజార్‌లో సీజనల్ పండ్లను విక్రయించడానికి హైదరాబాద్ వచ్చేవాడు. ఈ వ్యాపారంలో తగినంత డబ్బులు రాకపోవడంతో ఇద్దరు కలిసి హాష్ ఆయిల్ విక్రయిస్తే అధిక డబ్బులు వస్తాయని భావించారు. ఈ నెల 15న ఒడిస్సా నుంచి జగన్నాథ కముది సీతాఫలంతో పాటు 632.98 గ్రాముల హాష్ ఆయిల్‌ను కాశీరం పాంగి ఇచ్చి హైదరాబాద్‌కు పంపాడు. కాశీరం పాంగి సుల్తాన్ బజార్‌లో పండ్లు అమ్మిన తర్వాత హాష్ ఆయిల్ తీసుకుని సోమవారం రాత్రి ఎల్‌బీనగర్ ఎన్టీఆర్‌నగర్ వెజిటబుల్ మార్కెట్ సర్వీస్ రోడ్డు వద్ద వచ్చి జగన్నాథ్ కముది ఫోన్ కాల్ కోసం ఎదురు చూస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ పోలీసులు కాశీరం పాంగిని అదుపులోకి తీసుకుని మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

నల్లమందు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్..


చైతన్యపురి: నిషేధిత నల్లమందు (ఓఎం ఆయిల్)ను విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు. రాజస్థాన్ బీవర్ సిటికి చెందిన నరేందర్ చైతన్యపురిలో ఉంటూ కిరణా దుకాణం నడుపుతున్నాడు. డబ్బు ఆశతో నరేందర్ నల్లమందు విక్రయించటం మొదలు పెట్టాడు రాజస్థాన్‌కు చెందిన సంపత్ ద్వారా నల్లమందు తెప్పించుకుని అవసరమైన వారికి అందజేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న మహేశ్వరం ఎస్‌ఓటీ, చైతన్యపురి పోలీసులు కిరాణా దుకాణంపై దాడి చేసి 199 గ్రాముల నల్లమందు స్వాధీనం చేసుకున్నారు.

రాజకీయ లబ్ధికి చరిత్రను వక్రీకరిస్తోన్న బీజేపీ



లింగోజిగూడ: రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ మత ఉన్మాదంతో తెలంగాణ రైతంగా సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యులు ఈటీ నరసింహా ఆరోపించారు. సీపీఐ ఆధ్వర్యంలో హయత్‌నగర్ కుంట్లూర్ రావినారాయణ రెడ్డినగర్ కాలనీలో నిర్వహించిన తెలంగాణ రైతంగా సాయుధ పోరాట వార్షికోత్సవ ముగింపు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రైతంగా సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల త్యాగాలు మరువలేనివన్నారు. నిజాం నవాబులు పాలనలో గ్రామాలన్ని దేశ్‌ముఖ్, భూస్వాములు, పెత్తందార్ల చేతుల్లో ఉండటంతో ప్రజలను నిట్టా నిలువున దోచుకున్నారని ఆరోపించారు. సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల ప్రాబల్యం పెరగడంతో, హైదరాబాద్ రాష్ట్ర కమ్యూనిస్టుల వశం అవుతుందని, అప్పటి కేంద్ర హోంమంత్రి వల్లాభాయ్ పటేల్ నిజం నవాబుతో చీకటి ఒప్పందం చేసుకున్నారని అన్నారు. వల్లభాయ్ పటేల్‌తోనే తెలంగాణకు స్వేచ్ఛ లభించిందని బీజేపీ అనడం విడ్డురంగా ఉందన్నారు. యాదిరెడ్డి, జంగయ్య, రవీంద్రచారి, పార్వతాలు, పల్లె నరసింహ, శేఖర్‌రెడ్డి, పబ్బతి లక్ష్మణ్, హరిసింగ్ నాయక్, వేణుగోపాల్ చారి పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: ఎల్బీనగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో యజ్ఞ కమిటీ అధ్యక్షులు మల్లోజు నరేశ్, ప్రధాన కార్యదర్శి నారోజు కొండలాచారి, కోశాధికారి సింహాద్రి, దేవర కొండ శన్ముఖాచారి ఉత్సవ కమిటీ కన్వీనర్ అందోజు దయానందా చారి రంగారెడ్డి జిల్లా విశ్వ బ్రాహ్మణ సంగం అధ్యక్షులు, పులిగిల్ల శ్రీనివాసా చారి, ప్రధాన కార్యదర్శి పెద్ద కొలిమి బ్రహ్మ చారి, కోశాధికారి, లెంకోజు యాదగిరి చారి, పర్వతం శ్రీనివాసా చారి, నాగోజు రామాచారి, అందోజు శ్రీనివాసా చారి, సుంకోజు సత్తయ్య, శాల్వాచారి, నాగారం భాస్కరా చారి, పాల్గొన్నారు.

మన్సూరాబాద్: విశ్వకర్మ స్వర్ణకార సంఘం, హయత్‌నగర్ ఆధ్వర్యంలో మంగళవారం వినాయక్‌నగర్ కమ్యూనిటీహాల్లో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉ.6 గం నుంచి 9 గంటల వరకు విశ్వకర్మ భగవానుడు, విగ్రహానికి పుష్పాలంకరణ, అష్టోత్తర శతనామావళి సహస్త్ర పుష్పార్చన, 9 గంటలకు విశ్వకర్మ భగవానుని యజ్ఞం అనంతరం మహా నీవేదన కార్యక్రమాలు నిర్వహించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు రాగఫణి సతీష్‌కుమార్, అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సంతోష్‌చారి, కోశాధికారి కేశవచారి, సలహాదారు నాగరాజుచారి, యజ్ఞకమిటీ అధ్యక్షుడు యాదగిరిచారి, ప్రవీణ్‌చారి, బ్రహ్మచారి, సురేష్‌చారి, ప్రవీణ్‌చారి, విజయ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

19 నుంచి శ్రీదేవి భాగవత కథా సప్తాహ ప్రవచన జ్ఞానయజ్ఞం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్కేపురం డివిజన్ అలకాపురిలోని శృంగేరీ శంకరమఠంలో ఈ నెల 19 నుంచి 25 వరకు శ్రీదేవి భాగవత కథా సప్తాహ ప్రవచన జ్ఞానయజ్ఞం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ బ్రాంచ్ హెడ్ కొవ్వడి శ్రీనివాస్ తెలిపారు. శ్రీ దేవి భాగవత కథా సప్తాహ ప్రవచన కార్యక్రమం శ్రీ శృంగేరి శారదపీఠ ఆస్థాన పౌరాణికులు, ప్రవచన నిధి బ్రహ్మశ్రీ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రిచే నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

స్వాతంత్ర్య సమరయోధుడికి సత్కారం

చైతన్యపురి: వీర భైరాన్‌పల్లికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు రామిని వెంకటయ్యను మంగళవారం సీపీఎం నాయకులు సత్కరించారు. ప్రస్తుతం చైతన్యపురిలో ఉంటున్న వెంకటయ్య(97)ను ఆయన నివాసంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.చంద్రమోహన్ ఆధ్వర్యంలో కలిసి సత్కరించారు. నాటి రజాకార్లకు వ్యతిరేకంగా మూడు దళాలుగా ఏర్పడి భైరాన్‌పల్లి గ్రామ పొలిమేరలో రక్షణగా నిలిచారని చంద్రమోహన్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో కీసర నర్సిరెడ్డి, వెంకన్న, ఆవుల్లయ్య, వీరయ్య, శ్రీనివాస్, మనోహర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

జాతీయ జెండా రెపరెపలు

లింగోజిగూడ :ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో పలు డివిజన్‌లలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని వివిధ పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించారు. కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ తన కార్యాలయంలో మంగళవారం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం సాయుధ పోరాట అమరులకు నివాళులు అర్పించారు.మన్సూరాబాద్ పెద్ద చెరువు, మన్సూరాబాద్ చౌరస్తాలలో స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి అమరులకు నివాళులు అర్పించారు. ఎల్‌బీనగర్ చంద్రపురి కాలనీ సంక్షేమ భవన్‌లో తెలంగాణ విమోచన దినోత్సవంలో పాల్గొన్న వారిని సన్మానించి జాతీయ జెండాను ఆవిష్కరించారు.బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఎస్‌కేడీ నగర్ చౌరస్తాలో స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అమరులకు నివాళులు అర్పించారు.చంపాపేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో చంపాపేట గాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి అమరులకు నివాళులు అర్పించారు.